సాక్షి రంగారెడ్డి

శనివారం । 23 । నవంబర్ । 2024



పల్లె సంత సౌకర్యాల చింత

పల్లెల్లో ఏర్పాటు చేస్తున్న కూరగాయల సంతలకు గుర్తింపు లేకుండా పోయింది. పట్టించుకునే వారే కరువయ్యారు. 8లో ▸



శివలింగం చోరీ

దేవాలయంలో ఉన్న శివలింగాన్ని దుండగులు మాయం చేసిన ఘటన ఫరూఖ్‌నగర్‌లో చోటు చేసుకుంది. 8లో ▸



వ్యతిరేక విధానాలపై పోరు

ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరు చేస్తున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ పేర్కొన్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

మాక్ టెస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తుక్కుగూడ: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–2 పరీక్ష నిర్వహిస్తున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు రెండు ఫ్రీ ఫుల్ లెంగ్త్ మాక్ టెస్టుల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కె.నవీన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 29 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మాక్ టెస్టులు డిసెంబర్ 2, 3, 9, 10వ తేదీల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. అర్హత ఉన్న మైనార్టీ అభ్యర్థులు తమ దరఖాస్తులను గన్‌ఫౌండ్రీలోని రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పింఛన్లు పెంచే వరకు పోరాటం ఆగదు



మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, పెన్షన్లు పెంచే వరకు పోరాటం ఆపేది లేదని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య హెచ్చరించారు. కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు శుక్రవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కాళ్ల జంగయ్య మాట్లాడుతూ.. పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చి సంవత్సరం గడుస్తున్నా నేటికీ పెంచకపోవడం సిగ్గు చేటని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 26న నిర్వహిస్తున్న ‘చలో హైదరాబాద్’కు భారీ సంఖ్యలో పెన్షన్‌దారులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, మహిళా అధ్యక్షురాలు యాదమ్మ, నాయకులు జంగయ్య, బాల్‌రాజు, మహ్మద్ సలీం, ఆకుల సంజీవ, మైసయ్య పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియపై సమావేశం



అధికారులతో సమావేశమైన డిప్యూటీ కలెక్టర్ పద్మావతి

కందుకూరు: ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి డిప్యూటీ కలెక్టర్ పద్మావతి శుక్రవారం ఆర్డీఓ అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. ఆయా మండలాల్లో జరుగుతున్న ఓటరు నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు సంబంధించిన అభ్యంతరాలు, ఎన్‌రోల్‌మెంట్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మహేశ్వరం, బాలాపూర్, సరూర్‌నగర్, కందుకూరు మండలాలకు చెందిన తహసీల్దార్లు పాల్గొన్నారు.

రాజకీయ చైతన్యంతోనే రాజ్యాధికారం



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందిస్తున్న బర్క కృష్ణ

షాద్‌నగర్: రాజకీయ చైతన్యంతోనే బీసీలు రాజ్యాధికారం సాధించొచ్చని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో ఉన్న ఓ హోటల్‌లో శుక్రవారం బీసీ సేన నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల ప్రశాంత్ ముదిరాజ్, నందిగామ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి బర్క కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీలు జెండాలు మోసే స్థాయి నుంచి ఎగురవేసే స్థాయికి ఎదగాలన్నారు. బీసీల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఫరూఖ్‌నగర్ మండల బీసీ సేన నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నడికూడ రఘునాథ్ యాదవ్, శ్రీశైలం, శివ, రాజు, మహేశ్, రాజేశ్, కిట్టు, శ్రీను, బాలు, నర్సింహ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చలికి గజగజ

రోజురోజుకూ కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి.. చలి తీవ్రత పెరుగుతోంది.. వసతి గృహాల్లోని విద్యార్థులు చలి గాలులకు గజగజ వణుకుతున్నారు.. ఈ క్రమంలో ‘సాక్షి’ ఆయా సంక్షేమ హాస్టళ్లలో గురు, శుక్రవారాల్లో విజిట్ నిర్వహించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని చోట్ల తలుపులు, కిటికీలు సరిగా లేవు.. వాటర్ హీటర్లు పనిచేయడం లేదు.. వేకువజామునే చన్నీటితో స్నానం చేస్తున్నారు.. దుప్పట్లు సరిగా లేక కొందరు ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్నారు. మరికొన్ని చోట్ల అరకొరసౌకర్యాల మధ్య విద్యాభ్యాసం సాగిస్తున్నారు.

సాక్షి విజిట్

సమస్యల వలయంలో సంక్షేమ హాస్టళ్లు

- పని చేయని వాటర్ హీటర్లు
- విరిగిన తలుపులు, పగిలిన కిటికీలు
- దుప్పట్ల పంపిణీ అంతంత మాత్రమే
- చలికాలం వణికిపోతున్న విద్యార్థులు



కడ్తాల్: మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో తలుపులు లేని కిటికీలు

❖ ఉలెన్ దుప్పట్ల ఊసే లేదు

కడ్తాల్: మండల కేంద్రంలో గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, వసతి గృహాలతో పాటు మండల పరిధిలోని మైసిగండిలో గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, ముద్వీన్ గ్రామంలో సాంఘీక సంక్షేమశాఖ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల, వసతి గృహాల్లో 282 మంది విద్యార్థులు ఉండగా, మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 394 మంది విద్యాభ్యాసం సాగిస్తున్నారు. చలి తీవ్రత పెరుగుతుండటంతో వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఆయా ఆశ్రమ పాఠశాలల్లో చాలినన్ని మంచాలున్నా పరుపులు లేవు. బెడ్‌షీట్లు అందజేసినా చలి నుంచి అంతగా రక్షణ ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారు. చలి నుంచి రక్షణ కోసం రెండేళ్ల క్రితం ఉలెన్ దుప్పట్లు అందజేశారని, మళ్లీ ఇంత వరకు ఇవ్వలేదని విద్యార్థులు వాపోతున్నారు. సోలార్ వాటర్ హీటర్ల సదుపాయం లేకపోవడంతో ఆరుబయట వణికించే చలిలో కుళాయిల వద్ద చన్నీళ్లతో స్నానాలు చేస్తూ అవస్థలు పడుతున్నారు. మైసిగండి ఆశ్రమ పాఠశాలలోని ఒక గది కిటికీలకు రెక్కలు లేకపోవడంతో చలి తీవ్రత, దోమల దాడిని తట్టుకునేందుకు రాత్రి వేళ అడ్డంగా దుప్పటి అడ్డు పెడుతున్నారు. కొంత మంది చలి నుంచి రక్షణకు ఇళ్ల నుంచి దుప్పట్లు తెచ్చుకుని కప్పుకొంటున్నారు.

చన్నీటి స్నానంతో ఇబ్బంది



ఉదయాన్నే చన్నీళ్లతో స్నానం చేయడం ఇబ్బందిగా ఉంది. సోలార్ వాటర్ హీటర్ ఏర్పాటు చేసి, చలికాలంలో వేడి నీటిని అందిస్తే బాగుంటుంది.

– నందు, 9వ తరగతి, మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాల

ఉలెన్ దుప్పట్లు ఇవ్వాలి



రాత్రివేళ, ఉదయం విపరీతమైన చలి వీస్తోంది. చలి నుంచి రక్షణకు ఉలెన్ దుప్పట్లు, మంచాలపై పరుపులు, వేడి నీటి సౌకర్యం కల్పించాలి.

– రాఘవ, 9వ తరగతి, బాలుర గిరిజన వసతిగృహం

❖ వాటర్.. షివర్



నేదునూరు ఎస్సీ హాస్టల్‌లో పాడైన వాటర్ ఫిల్టర్

కందుకూరు: నేదునూరు పరిధిలోని సాంఘీక సంక్షేమ వసతి గృహంలో మొత్తం 70 మంది విద్యార్థులకు గాను ప్రస్తుతం 58 మంది ఉన్నారు. ప్రభుత్వం బెడ్‌షీట్లు, రగ్గులు సరఫరా చేసింది. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ పాడై మూడేళ్లయింది. ఇంత వరకు మరమ్మతులు చేయించలేదు. బయటి నుంచి తాగునీరు తెప్పిస్తున్నారు. మరోవైపు చల్లని చలిలో చన్నీటి స్నానాలు చేయాల్సి వస్తోంది. మూత్రశాలలు, మరుగుదొడ్ల భవనంపై ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్ పాడై ఏడాదైంది. వాడిన వృథా నీరు బయటికి వెళ్లే మార్గం లేక ఆవరణలోనే చేరి దుర్వాసన వెదజల్లుతోంది.

వేడి నీళ్లు వస్తే బాగుండు



రోజు ఉదయం చల్లని నీటితో స్నానం చేయాలంటే ఇబ్బందిగా ఉంది. వాటర్ హీటర్‌కు మరమ్మతులు చేయిస్తే వేడి నీళ్లు వస్తాయి.

– వరప్రసాద్, 7వ తరగతి

❖ వేడి నీటి సౌకర్యం లేక..

కొత్తూరు: పట్టణంలో ప్రస్తుతం కేజీబీవీ, ఎస్సీ బాలికల హాస్టళ్లు కొనసాగుతున్నాయి. కేజీబీవీలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు 360 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. చలికాలం కావడంతో గత వారమే హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులకు కార్పెట్లు, బ్లాంకెట్లు పంపిణీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థినుల సంఖ్యకు సరిపడా టాయిలెట్స్, స్నానాలకు వేడి నీటి సౌకర్యం లేకపోవడంతో చల్లనీటినే వాడుకోవాల్సి వస్తోంది. ఎస్సీ బాలికల హాస్టల్‌లో 120 మంది బాలికలు చదువుకుంటున్నారు. వారికి నెల క్రితమే బ్లాంకెట్లు, కార్పెట్లు అందజేశారు. ఇక్కడ సోలార్ వాటర్ హీటర్ ఏర్పాటు చేయడంతో వేడినీరు అందుబాటులో ఉంది.

❖ విషసర్పాల భయం

యాచారం: విషసర్పాల భయంతో నందివనపర్తి దళిత అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహం విద్యార్థులు కంటికి కునుకు లేకుండా గడుపుతున్నారు. వసతి గృహం చుట్టూ కంపచెట్లు, వ్యవసాయ పొలాలు ఉన్నాయి. చీకటి పడిందంటే చాలు విషసర్పాలు వసతి గృహంలోకి వస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే నాలుగు తాచు పాములు వచ్చినట్లు విద్యార్థులు చెబుతున్నారు. భయంభయంగా గడుపుతున్నట్టు తెలిపారు. వారం క్రితమే విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్వెట్టర్లు కూడా పంపిణీ చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.



స్వెట్టర్ ఇస్తే బెటర్

చలికి ఇబ్బందులు పడుతున్నాం. స్వెట్టర్లు అందించాలి. చీకటి పడిందంటే చాలు పాములు వస్తున్నాయి. రాత్రి భోజనం చేసిన తర్వాత బయటకు రావడం లేదు.

– రాఘవేందర్, ఐదో తరగతి



వసతి గృహంలో నిద్రిస్తున్న విద్యార్థులు



కడ్తాల్: మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో కుళాయిల వద్ద చన్నీటి స్నానాలు చేస్తున్న విద్యార్థులు

❖ పెరిగిన చలిలో చన్నీటి స్నానాలు

షాబాద్: షాబాద్ ఎస్సీ, బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు బ్లాంకెట్లు, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. అయినా చలికి తట్టుకోలేక ఇంటి నుంచి తెచ్చుకున్నవి కూడా వాడుకుంటున్నారు. ఎస్సీ హాస్టల్‌లో 106 మంది విద్యార్థులు ఉన్నారు. సోలార్ వాటర్ హీటర్లు పనిచేయడం లేదు. ప్రతిరోజూ విద్యార్థులు చన్నీటితో స్నానం చేస్తున్నారు. వాటర్ ఫిల్టర్ పనిచేకపోవడంతో బోరు నీరు తాగుతున్నారు. బీసీ హాస్టల్‌లో 95 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బీసీ హాస్టల్‌లో వాటర్ హీటర్ లేకపోవడంతో చన్నీటి స్నానం చేస్తున్నారు. సరిపడా బాత్రూంలు కూడా లేవు. బెడ్‌షీట్లు పంపిణీ చేసినా చలికి తట్టుకోలేక కొంతమంది ఇంటి నుంచి తెచ్చుకున్నారు.

వాటర్ హీటర్లు అమర్చాలి



చలి ఉన్నా ఆరుబయట చల్లటి నీటితోనే స్నానం చేస్తున్నాం. చలి గాలులకు వణికిపోతున్నాం. అధికారులు స్పందించి కొత్త సోలార్ వాటర్ హీటర్లు అమర్చాలి.

– ప్రవీణ్‌కుమార్, 10వ తరగతి, బీసీ హాస్టల్, షాబాద్



షాబాద్ ఎస్సీ హాస్టల్‌లో చన్నీటితో స్నానం చేస్తున్న విద్యార్థులు

❖ దుప్పట్లు ఓకే.. వేడి నీళ్లు లేక వణుకే

చేవెళ్ల: మండలకేంద్రంలోని ఎస్సీ వసతిగృహంలో విద్యార్థులకు వేడినీటి వసతి లేకపోవడంతో చల్లటి నీటితోనే స్నానాలు చేస్తున్నారు. ఇక్కడ 3 నుంచి 10 వతరగతి వరకు 75 మంది విద్యార్థులు ఉన్నారు. ఇటీవలే దుప్పట్లు అందించారు. వాటితో రాత్రి చలిని తట్టుకునేందుకు కొంత వెసులుబాటు అయింది. ఉదయం మాత్రం చల్లని నీటితో స్నానాలు చేసేందుకు విద్యార్థులు వణికిపోతున్నారు. వేడినీటిని అందించేందుకు భవనంపై ఏర్పాటు చేసిన సోలార్ హీటర్లను కోతుల గుంపు వచ్చి ధ్వంసం చేశాయి. మరమ్మతులు చేయపోవడంతో చన్నీటి స్నానాలు తప్పడం లేదు. బోరు కూడా లేకపోవటంతో మిషన్‌భగీరథ నీటిపైనే ఆధారపడ్డారు. ఏదైనా కారణంతో నల్లా రాకపోతే ట్యాంకర్ల ద్వారా తెప్పించాల్సిందే.

హీటర్లు లేక ఇబ్బంది



ఇటీవలే కొత్త దుప్పట్లు ఇచ్చారు. స్నానాలకు మాత్రం ఉదయం వేడినీరు రావటం లేదు. చల్లనీటితోనే స్నానాలు చేస్తున్నాం. వేడినీటి హీటర్లు బాగు చేయిస్తే చలి కాలం బాగుంటుంది.

– అనిల్, ఎస్సీ వసతిగృహం విద్యార్థి

గీజర్లు లేక తప్పని వణుకు

మహేశ్వరం: మండలంలోని బీసీ, ఎస్టీ, ఎస్సీ హాస్టళ్లలో విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు బెడ్‌షీట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కానీ మూడు హాస్టళ్లలో గీజర్లు లేకపోవడంతో చలి కాలం ఉదయం పూట చన్నీటితో స్నానం చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ హాస్టల్‌లో 70 మంది, ఎస్టీ హాస్టల్‌లో 95 మంది, బీసీ హాస్టల్‌లో 75 మంది విద్యార్థులు ఉన్నారు. బీసీ, ఎస్సీ హాస్టళ్లలో గీజర్లు మొత్తమే బిగించలేదు. ఎస్టీ హాస్టల్‌లో ఉన్నా మరమ్మతులకు గురైంది. కొంతమంది విద్యార్థులు దుప్పట్లు ఉన్నా చలికి తట్టుకోలేక ఇంటి నుంచి తెచ్చి కప్పుకొంటున్నారు.



మహేశ్వరం ఎస్టీ హాస్టల్‌లో నిద్రిస్తున్న విద్యార్థులు

❖ వేడినీటికీ.. తాగునీటికీ తిప్పలు

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఆర్‌ఓ ప్లాంట్ చెడిపోవడంతో మంచినీటిని రోజూ కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ 35 మంది విద్యార్థులు ఉన్నారు. గత నెలలో అవసరమైన బెడ్‌షీట్లు, బ్లాంకెట్లు అందించారు. ఇటీవల తలుపులు, కిటికీలను బాగుచేశారు. ఆర్‌ఓ ప్లాంటు చెడిపోయి నెలలు గడుస్తున్నా మరమ్మతులు జరిపించడం లేదు. ఉదయం పూట స్నానాలకు వేడినీరు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వసతిగృహం భవనంపై సోలార్ గీజర్ ఏర్పాటు చేయగా పనిచేయకపోవడంతో వేడినీటి వసతి లేకుండా పోయింది. భవనం చుట్టూ రాత్రి వేళ చీకటి ఉండటంతో విద్యార్థులు భయపడుతున్నారు.

వేడినీటి వసతి కల్పించాలి



చలికాలం కావడంతో స్నానానికి వేడినీటి వసతి కల్పించాలి. ఆర్‌ఓ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలి. ప్రతిరోజూ నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఒక్కోసారి సమయానికి రాక ఇబ్బందులు పడుతున్నాం.

– శ్రీధర్, హాస్టల్ విద్యార్థి



చేవెళ్లలోని ఎస్సీ వసతిగృహంపై అలంకారప్రాయంగా ఉన్న సోలార్ వాటర్ హీటర్లు



ఆమనగల్లులోని బాలుర వసతిగృహం

సీసీఐ కేంద్రాలను వినియోగించుకోవాలి



చేవెళ్లలోని సీసీఐ కేంద్రం వద్ద జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు తదితరులు

చేవెళ్ల: పత్తి సాగు చేసిన రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. మండల పరిధిలోని దామరగిద్ద సమీపంలో ఉన్న శ్రీనివాస కాటన్‌మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్తిని ఎలా కొనుగోలు చేస్తున్నారు.. ఎలా తూకం వేస్తున్నారు.. తేమశాతం ఎలా చెక్ చేస్తున్నారనే విషయాలను స్వయంగా పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని ఆదేశించారు. మద్దతు ధరలు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. మార్కెట్ కమిటీ చైర్మన్, అధికారులు అందుబాటులో ఉంటారని రైతులకు ఏవైనా సమస్యలుంటే వారిని సంప్రదించాలని సూచించారు. పత్తి అమ్మకానికి తెచ్చిన రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట చేవెళ్ల వ్యవసాయశాఖ ఏడీ సురేశ్‌బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, మార్కెట్ కార్యదర్శి మహేందర్, మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్, ఏఈఓలు రమ్య, స్వాతి, బాలకృష్ణ, సీసీఐ ప్రతినిధి రాజీవ్ ఉన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో ‘కోహెడ’

రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకుడు ఉదయ్‌కుమార్



డీపీఆర్‌ను పరిశీలిస్తున్న ఉదయ్‌కుమార్ తదితరులు

తుర్కయంజాల్: కోహెడలో నూతన మార్కెట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తామని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకుడు పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. కోహెడలో నిర్మించనున్న మార్కెట్ స్థలాన్ని శుక్రవారం నూతన పాలకవర్గం, అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఉపయోగపడేలా అన్ని రకాల సదుపాయాలతో పాటు దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద మార్కెట్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. సమీకృత మార్కెట్ నిర్మాణం ద్వారా ఎగుమతులు, దిగుమతులు జరుగుతాయని చెప్పారు. దీనిపై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సంబంధిత అధికారులతో సమావేశం ఉంటుందని వివరించారు. అంతకు ముందు ఫేజ్–1 కింద చేపట్టే నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కరాచారి, డైరెక్టర్లు అంజయ్య, జైపాల్‌రెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, గణేశ్‌నాయక్, రఘుపతిరెడ్డి, బండి మధుసూదన్‌రావు, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్ గుప్తా, ఇబ్రహీం, రాష్ట్ర మార్కెటింగ్ అదనపు సంచాలకుడు ఆర్.లక్ష్మణుడు, ప్రాంతీయ సంచాలకుడు ఇ.మల్లేశం, జిల్లా మార్కెటింగ్ అధికారి రియాజ్, ఎస్ఈ లక్ష్మణ్‌గౌడ్, డీఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు



జెండావిష్కరణలో పాల్గొన్న సీపీఎం నాయకులు

సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

యాచారం: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ పేర్కొన్నారు. మండల పరిధిలోని చింతుల్ల గ్రామంలో శుక్రవారం గ్రామ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విధ్వంసాలకు పాల్పడుతుందని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే కంపెనీలను ప్రైవేట్ పరం చేస్తూ పేదలకు తీవ్ర అన్యాయం చేస్తుందని అన్నారు. జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ మాట్లాడుతూ.. ఫార్మాసిటీలు వద్దని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఈ సర్కార్ ఎందుకు ఏర్పాటు చేయాలని చూస్తుందో అర్థం కావడం లేదని అన్నారు. అనంతరం చింతుల్ల గ్రామ శాఖలను ఎన్నుకున్నారు. మూడు శాఖలకు కార్యదర్శులుగా వినోద్, భగత్, మహేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకు ముందు జెండావిష్కరణ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, యాదయ్య, సామేల్, నాయకులు నర్సింహ, బ్రహ్మయ్య, జంగయ్య, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలకు నూతన పాలకులు



యాట గీత, చైర్‌పర్సన్



భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్

ఆమనగల్లు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కడ్తాల మండలం మక్తమాదారం గ్రామానికి చెందిన యాట గీత, వైస్ చైర్మన్‌గా కడ్తాలకు చెందిన గూడురి భాస్కర్‌రెడ్డి నియమతులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులుగా జల్ల రమేశ్‌గౌడ్ (బ్రాహ్మణపల్లి), నరేశ్ నాయక్ (కడ్తాల), జంగయ్య(మాడ్గుల), యాదయ్య (నాగిళ్ల), సంపత్‌కుమార్ (నల్లవారిపల్లి), శ్యాంసుందర్‌రెడ్డి (తలకొండపల్లి), మహ్మద్ అజీం (తలకొండపల్లి), వస్పుల శ్రీశైలం (ఆమనగల్లు), వెంకట్‌రెడ్డి (వెల్జాల), తాళ్ల రవీందర్(ఆమనగల్లు), మిట్టపల్లి అంజయ్య (తలకొండపల్లి), కండె పాండురంగయ్య (ఆమనగల్లు), తలకొండపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు గట్ల కేశవరెడ్డి, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ అధికారి, ఆమనగల్లు ఏడీఏలను నియమించారు. నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీకాలం రెండేళ్లు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

షాద్‌నగర్ నూతన కమిటీ నియామకం



సులోచన, చైర్‌పర్సన్



బాబర్‌ఖాన్, వైస్ చైర్మన్

షాద్‌నగర్: షాద్‌నగర్ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలిని నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్ పర్సన్‌గా సులోచన, వైస్ చైర్మన్‌గా మహ్మద్ అలీఖాన్ అలియాస్ బాబర్‌ఖాన్, సభ్యులుగా కొర్ర రవి, బాలశౌరెడ్డి, చాకలి నర్సింలు, జానంపేట సురేష్, వెంకట్ నర్సింహారెడ్డి, మల్లయ్య, భాస్కర్‌గౌడ్, కరుణాకర్, వెంకట్‌రెడ్డి, లాహోటి భరత్, కక్కునూరి సందీప్‌కుమార్, తాటిశెట్టి నవీన్‌కుమార్ నియమితులయ్యారు. వీరితో పాటు కొందుర్గు పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్, అగ్రికల్చర్ ఏడీఏ, మున్సిపల్ చైర్మన్‌ను సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



ఆలయం ఎదుట ఆందోళన చేపట్టిన హిందూ సంఘాల నేతలు



పట్టణ సీఐతో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ఆలయంలోని శివలింగం చోరీ

- షాద్‌నగర్ బసవన్న దేవాలయంలో ఘటన
- ఆందోళన చేపట్టిన హిందూ ధార్మిక సంఘాలు

షాద్‌నగర్‌రూరల్: దేవాలయంలో ఉన్న శివలింగాన్ని దుండగులు చోరీ ఘటన షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని ఫరూఖ్‌నగర్‌లో ఉన్న బసవన్న ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఉదయమే స్థానికులు ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దేవాలయం వద్దకు పెద్ద ఎత్తున జనాలు చేరుకొని గుమిగూడారు. పలు హిందూ ధార్మిక సంఘాలు, బీజేపీ నేతలు ఆందోళన చేపట్టారు. పట్టణ సీఐ విజయకుమార్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఘటనా స్థలం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రప్పించి వివరాలను సేకరించారు. ఈ ఘటనపై దర్యాప్తును చేపడతామని, విచారణలో పూర్తి వివరాలను తెలుసుకుంటామని పట్టణ సీఐ తెలిపారు.

మనోభావాలు దెబ్బతీస్తే ఊరుకోం

దేవాలయాలలోని విగ్రహాలను ధ్వంసం చేసి హిందువుల మనోభావాలను దెబ్బ తీయాలని చూస్తే ఊరుకునేది లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అనేక హిందూ దేవాలయాలలో గుర్తు తెలియని దుండగులు విగ్రహాలను ఎత్తుకెళ్లడం, ధ్వంసం చేయడం వంటి విధ్వంసాలకు పాల్పడుతున్నారన్నారు. ఇటీవల సికింద్రాబాద్, శంషాబాద్, బాలానగర్‌లో విగ్రహాలను ధ్వంసం చేసిన ఘటనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. శివలింగాన్ని ఎత్తుకెళ్లిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కఠినంగా శిక్షించాలి

శివలింగాన్ని ఎత్తుకెళ్లిన దుండగులను కఠినంగా శిక్షించాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ డిమాండ్ చేశారు. శివలింగాన్ని ఎత్తుకెళ్లిన ఘటనపై ఆలయం ఎదుట హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ఘటనకు కారకులైన దుండగులను తక్షణమే పట్టుకొని శిక్షించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువ సత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, నాయకులు అమర్‌నాథ్, వెంకటేశ్, మోహన్‌సింగ్, ప్రదీప్, చంద్రశేఖర్, రమేశ్, రామాంజనేయులు, నర్సింలు, శేఖర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమర భేరికి తరలిరండి

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్



నినాదాలు చేస్తున్న బీసీ సంఘం నాయకులు

కడ్తాల్: తమ సమస్యలపై ఈ నెల 25న రవీంద్ర భారతిలో నిర్వహించనున్న 'బీసీల సమర భేరి' సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ.. జాతీయ జనగణనలో కులగణన చేపట్టాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి, 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్‌లలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీల కోసం కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు రవి, ప్రేమ్‌రాజ్, వెంకటేశ్, యాదయ్య, చంద్రశేఖర్, కుమార్, మహేశ్, వి.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల చొరవతో నిలిచిన ప్రాణం



ఠాణా ఆవరణలో నర్సింహగౌడ్‌తో ఎస్‌ఐ వెంకటేశ్

ఆమనగల్లు: తాను చనిపోతున్నానంటూ కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన ఓ వ్యక్తి ఆమనగల్లు పోలీసులు చాకచక్యంగా కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని చంపాపేట్‌కు చెందిన నర్సింహగౌడ్ శుక్రవారం ఉదయం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి సమీపంలో ఉన్న ఓ వెంచర్ నుంచి తన భార్యకు వీడియోకాల్ చేసి, ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. దీంతో కంగారు పడిన ఆమె కుటుంబ సభ్యులతో వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నర్సింహగౌడ్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా అతను ఉన్న ప్రాంతాన్ని గుర్తించిన హైదరాబాద్ పోలీసులు ఆమనగల్లు పీఎస్‌కు సమాచారం అందించారు. వెంటనే ఎస్‌ఐ వెంకటేశ్, సిబ్బంది కలిసి విఠాయిపల్లి సమీపంలోని వెంచర్‌లో ఉన్న నర్సింహగౌడ్‌ను స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేడు, రేపు ఓటరు నమోదుకు ప్రత్యేక డ్రైవ్

చేవెళ్ల: ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమంలో 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు భాగస్వాములు కావాలని చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ప్రతి గ్రామంలోని బూత్ స్థాయిలో అధికారి అందుబాటులో ఉంటారని చెప్పారు. గ్రామాల్లో ఉండే రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ఓటు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదర్శ పాఠశాల సెప్టిక్ ట్యాంక్‌లో మృతదేహం

- శరీరం నుంచి విడివడిన పుర్రె, చేతులు
- ట్యాంకులో దొరకని చేతుల ఆచూకీ
- హత్యా..? ప్రమాదమా అనే కోణాల్లో దర్యాప్తు
- అదృశ్యం కేసులపై ఆరా తీస్తున్న పోలీసులు

చేవెళ్ల/శంకర్‌పల్లి: ఆదర్శ పాఠశాల సెప్టిక్ ట్యాంకులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించడం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆడుకుంటూ అటుగా వెళ్లగా.. తెరిచి ఉన్న సెప్టిక్ ట్యాంకులో మృతదేహం ఉన్నట్లు గమనించారు. వెళ్లి ఈ విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. మున్సిపల్ సిబ్బంది, పోలీసులు వచ్చి సెప్టిక్ ట్యాంకులో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. కుళ్లిపోయిన స్థితిలో ఉన్న బాడీకి తల, రెండు చేతులూ లేకపోవడంతో ట్యాంకులో వెతికించారు. పుర్రె భాగం దొరకగా, చేతుల లభించలేదు. 15- 20 రోజుల క్రితమే ఈఘటన జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయస్సు 35- 40 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. అయితే ఎక్కడైనా హత్య చేసి ట్యాంకులో పడేశారా..? ప్రమాదవశాత్తు పడిపోయాడా అనే దిశగా పోలీసులు విచారణ చేస్తున్నారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతడి ఆచూకీ తెలిస్తేనే కానీ పూర్తి వివరాలు రాబట్టవచ్చని పోలీసులు తెలిపారు. ఇందులో భాగంగా మిస్సింగ్ కేసులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

కార్మికులకు జీతాలు పెంచాలి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

చేవెళ్ల: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు జీతాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె. రామస్వామి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏఐటీయూసీ మండల సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్న కార్మికుల బతుకులు మాత్రం మారటం లేదన్నారు. మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. చాలీచాలని జీతాలతో జీవితాలను గడపటం కష్టంగా మారుతుందన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో ఎన్నో కంపెనీలు కొత్తవి పుట్టుకువస్తున్నాయన్నారు. కానీ స్థానిక యువతకు ఉపాధి కల్పించటం లేదన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను కంపెనీలకు తీసుకువస్తున్నారన్నారు. వారికి తక్కువ జీతాలకు పనికి పెట్టుకొని ఎక్కువ పని గంటలు చేయించుకుంటున్నట్లు ఆరోపించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సత్యానారాయణ, మండల అధ్యక్షుడు శివ నాయకులు శివయ్య, మంజుల, మీనాక్షి, పద్మ, లలిత, రాంచందర్, శ్రీను, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు టీఐఈ సిల్వర్‌జూబ్లీ వేడుకలు

మణికొండ: ది ఇండస్ ఎంటర్‌ప్రెన్యూనర్స్ (టీఐఈ) ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి కావటంతో శనివారం సాయంత్రం గోల్కొండ రిసార్ట్‌లో సిల్వర్‌జూబ్లీ వేడుకలను నిర్వహించనున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కొందుర్గు: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొందుర్గు గ్రామానికి చెందిన లచ్చంపేట మల్లేశ్(22) శుక్రవారం రాత్రి లాల్‌పహాడ్ వైపు నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తుండగా పేపర్ పరిశ్రమ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు కొందుర్గు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఇంకా తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యం: కేసు నమోదు

మొయినాబాద్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. ఈ సంఘటన మండల పరిధిలోని ఓ గ్రామంలో చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఓ బాలిక ఈనెల 19న రాత్రి 9గంటలకు ఎప్పటిలాగే కుటుంబ సభ్యులతో కలిసి నిద్రపోయింది. 20వ తేదీ తెల్లవారు జామున 3 గంటలకు బాలిక తండ్రి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. అనంతరం మేల్కొన్న బాలిక ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అయితే తోలుకట్టకు చెందిన బొలిగిద్ద పవన్‌పై అనుమానం వ్యక్తంచేస్తూ బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మణికొండ: డ్రైనేజీలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. నార్సింగి పోలీసుల సమాచారం మేరకు... కోకాపేటలోని లెజెండ్ చైమ్స్ గేటెడ్ కమ్యూనిటీలోని విల్లా నెంబర్ 192 వెనుక ఉన్న డ్రైనేజీ కాలువలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. అతని వయసు 50 నుంచి 60 సంవత్సరాలు ఉంటుంది. భిక్షాటన చేసే వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయాడా.. సరైన ఆహారం లేక చనిపోయాడా.. ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు. అతనికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.



నందివనపర్తిలో నిలిచిన కూరగాయల విక్రయాల సముదాయ షెడ్డు నిర్మాణం



మాల్‌లో రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తున్న చిరు వ్యాపారి

పల్లె సంత.. సౌకర్యాల చింత

రోడ్లపైనే విక్రయిస్తున్న చిరు వ్యాపారులు

- మార్కెట్ సముదాయాలు నిర్మిస్తే పంచాతీయలకు ఆదాయం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

యాచారం: పల్లెల్లో ఏర్పాటు చేసే కూరగాయల సంతలకు గుర్తింపు లేకుండా పోయింది. వాటికి ప్రాధాన్యం కల్పిస్తే పంచాయతీలకు ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నప్పటికీ, పట్టించుకునే వారే కరువయ్యారు. గ్రామాల్లోని పొలాల్లో పండించిన కూరగాయలను ఉదయం, సాయంత్రం వేళల్లో రైతులతో పాటు చిరు వ్యాపారులు విక్రయిస్తారు. నందివనపర్తి, నక్కర్తమేడిపల్లి, కొత్తపల్లి, గడ్డమల్లయ్యగూడ, గునుగల్, కుర్మిద్ద, చౌదర్‌పల్లి, చింతుల్ల, నల్లవెల్లి, మాల్ తదితర గ్రామాల్లో ప్రధాన చౌరస్తాల్లో కూరగాయలను పెట్టి అమ్మకాలు జరుపుతారు. నిత్యం ఒక్కో గ్రామ పంచాయతీ పరిధిలో రూ.5 వేల నుంచి రూ.20 వేలకు పైగానే కూరగాయల విక్రయిస్తారు. మండల వ్యాప్తంగా దాదాపు 500 మందికి పైగా చిరువ్యాపారులు ఉపాధి పొందుతారు.

తాజా కూరలతో డిమాండ్

పల్లె కూరగాయల సంతల్లో దొరికే పలు రకాల కూరగాయలు తాజాగా ఉండడంతో డిమాండ్ ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో కూరగాయలను తెంపి సాయంత్రం విక్రయిస్తారు. ఆకు కూరలైతే ఉదయం 5 గంటలకే పొలాల వద్దకు వెళ్లి తీసుకొస్తారు. సంతలో దొరికే తాజా కూరగాయలను గ్రామస్తులు సైతం ఆసక్తిగా కొనుగోలు చేస్తారు. బయట మార్కెట్లో కంటే తక్కువ ధర, తాజాగా ఉండడంతో గ్రామస్తులే కాక, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విక్రయానికి ఆసక్తి చూపుతారు.

సౌకర్యాలు కల్పించాలి

పల్లెల్లోని కూరగాయల సంతలకు సౌకర్యాలు కల్పిస్తే గ్రామ పంచాయతీలకు ఏటా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. గతంలో మేజర్ గ్రామ పంచాయతీలైన నందివనపర్తి, నక్కర్తమేడిపల్లి, గునుగల్, చింతపట్ల, మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, కొత్తపల్లి, తాడిపర్తి, కుర్మిద్ద, చింతుల్ల, గడ్డమల్లయ్యగూడ తదితర గ్రామాల్లో ప్రత్యేక షెడ్లు నిర్మించి చిరు వ్యాపారులకు కూరగాయలు విక్రయించుకోవడానికి అద్దెలకు ఇస్తే ఏటా ఆదాయం వచ్చేదని అధికారులు భావించారు. మోడల్‌గా నందివనపర్తిలో రూ.10 లక్షలతో షెడ్డు నిర్మాణం ప్రారంభించారు. ఆ తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ షెడ్డు నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. షెడ్డు లేకపోవడంతో చిరువ్యాపారులు, మహిళా రైతులు రోడ్లపైనే కూరగాయలను విక్రయిస్తున్నారు.


రోడ్డుపైనే విక్రయం



మాల్‌లోని రోడ్డు పక్కనే 20 ఏళ్లుగా కూరగాయలు విక్రయిస్తున్నా. నిత్యం రూ.2 వేలకు పైగానే అమ్ముతాను. మాల్ పరిసర గ్రామాల్లో ఉద్యోగులు చేసే వారు ఇంటికి వెళ్లేటప్పుడు తాజా కూరగాయలు కొనుగోలు చేసి తీసుకెళ్తారు. షెడ్డు సౌకర్యం కల్పిస్తే అమ్ముకోడానికి బాగుంటుంది.

– మల్లమ్మ, చిరు వ్యాపారి, మాల్

నిలిచిన పనులు



నందివనపర్తిలో 30 మందికి పైగానే చిరువ్యాపారులు ఉదయం, సాయంత్రం వేళల్లో కూరగాయలు విక్రయిస్తారు. రోడ్డుపైనే విక్రయించడంతో ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతోంది. రూ.10 లక్షలతో షెడ్డును నిర్మించి, మిగతా పనులకు నిధుల్లేక నిలిచిపోయాయి.

– ఉదయశ్రీ, మాజీ సర్పంచ్, నందివనపర్తి

నివేదిక పంపిస్తా



గ్రామాల్లో సంతలకు స్థలాలు, సౌకర్యాల కల్పన కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తా. ఆయా గ్రామాల్లోని చిరు వ్యాపారులు రోడ్లపైనే ఉదయం, సాయంత్రం వేళల్లో విక్రయిస్తారని తెలిసింది. సంతలకు సౌకర్యాలు కల్పించి, పంచాయతీలకు ఆదాయం పెంచుతాం.

– శ్రీలత, ఎంపీఓ, యాచారం